క్లుప్తంగా

జీజీహెచ్‌కు వెళ్లి పింఛన్ అందజేత



కాకినాడ జీజీహెచ్‌లో గోవిందరాజులుకు పింఛను అందిస్తున్న వలంటీర్ భగవాన్

రంగంపేట: మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన వై.గోవిందరాజులు ఇటీవల అనారోగ్యానికి గురై కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో వలంటీర్ ముంగి కాశీకృష్ణ భగవాన్ ఆదివారం ఉదయమే కాకినాడ జీజీహెచ్‌కు వెళ్లి బయోమెట్రిక్ తీసుకుని అతనికి పింఛను సొమ్ము రూ.2,750లు అందించారు. దీంతో గోవిందరాజులు కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

వైద్యశిబిరం



వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ రాజేష్

సీతానగరం: స్థానిక కస్తూర్బాగాంధీ ఆశ్రమంలో రాజమహేంద్రవరానికి చెందిన హరిత న్యూరో సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. న్యూరో ఫిజీషియన్, స్ట్రోక్ వైద్యనిపుణులు డాక్టర్ క్రొవ్విడి రాజేష్, డాక్టర్ సత్యం రమేష్‌బాబు వైద్యసేవలు అందించారు. పక్షవాతం, మతిమరుపు, మెదడు వాపు, వెన్నెముక, నరాల వ్యాధులకు సంబంధించి 60 మందిని పరీక్షించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆశ్రమ ప్రతినిధి జి.సుశీల, యన్నమని వెంకటనారాయణ, కె.నరసింహరావు, ఎస్.రామరాజు, శేఖర్, ఎం.ప్రభాకరరావు పాల్గొన్నారు.

నిరంతర సాధనతో విజయం తథ్యం



సువర్ణ, ఆమె తండ్రి ధర్మారావులను సత్కరిస్తున్న ప్రముఖులు

రాజానగరం: లక్ష్యాన్ని ఎంచుకుని, నిరంతరం సాధనం చేయడం ద్వారా విజయం సాధించవచ్చని గ్రూప్ -1 పరీక్షల ద్వారా డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికైన పరిపటి సువర్ణ అన్నారు. దివాన్ చెరువులోని డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్‌లో ఆదివారం తండ్రి ధర్మారావుతో పాటు ఆమెకు ఆత్మీయ సత్కారం లభించింది. ఈ సందర్భంగా అక్కడకు విచ్చేసిన యువతను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ తన విజయంలో తండ్రి ప్రోత్సాహం ఎంతో ఉందన్నారు. డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ వంటి స్వచ్ఛంద సంస్థల తోడ్పాటు సమాజానికి అవసరమన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధం కావడం, ఇంటర్వ్యూను ఎదుర్కొనే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ సుంకర వెంకటేశ్వరరావు, ట్రస్టీలు సుంకర నాగేశ్వరరావు, సత్యకుమార్, ప్రదీప్, వినీల, ఫణి పాల్గొన్నారు.

ప్రతిభకు ఉపకారం

- ఎన్ఎంఎంఎస్‌తో పేద విద్యార్థులకు భరోసా
- దరఖాస్తులకు 15 వరకూ గడువు
- ఎంపికైతే ఇంటర్ వరకూ ఏడాదికి రూ.12 వేల స్కాలర్‌షిప్



కొంకుదురు ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు

బిక్కవోలు: పేదరికం చదువుకు ఆటంకం కాకూడదనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం నిరుపేద విద్యార్థులకు భరోసా కల్పిస్తోంది. ఎనిమిదో తరగతిలో డ్రాపవుట్స్‌ను నివారించేందుకు ఏటా నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్)తో ప్రోత్సహిస్తోంది. ఎంపికైన విద్యార్థులకు తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం వరకూ ఏడాదికి రూ.12 వేల చొప్పున స్కాలర్‌షిప్ అందజేస్తోంది.

అర్హతలు ఇవే

2023–24 విద్యా సంవత్సరంలో జిల్లా పరిషత్, మోడల్, ఎయిడెడ్, మున్సిపల్ తదితర ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు స్కాలర్‌షిప్‌నకు అర్హులు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.3.50 లక్షల లోపు ఉండాలి. ప్రస్తుతం ఎనిమిదో తరగతి చదువుతూ ఏడో తరగతిలో జనరల్, బీసీ కులానికి చెందినవారైతే 55 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీలైతే 50 శాతం మార్కులు సాధించిన వారు పరీక్ష రాసేందుకు అర్హులు. జనరల్ బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ ఎస్టీలు రూ.50 పరీక్ష ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

డిసెంబర్ 3న రాత పరీక్ష

ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్ కోసం రాష్ట్రవ్యాప్తంగా డిసెంబర్ 3న రాత పరీక్ష నిర్వహించనున్నారు. తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో పరీక్ష ఉంటుంది. పరీక్ష రెండు విభాగాలుగా ఉంటుంది. ఒకటి మెంటల్ ఎబిలిటీ(ఎంఏటీ), రెండోది ఆప్టిట్యూడ్ టెస్ట్(ఎస్ఏటీ). 6, 7, 8వ తరగతి పాఠ్య పుస్తకాల్లోని సైన్స్, గణితం, సామాజిక అధ్యయనాల విభాగాల్లో 90 మార్కులు చొప్పున మొత్తం 180 మార్కులకు పరీక్ష ఉంటుంది. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు ఇస్తారు. నియోజకవర్గంలోని అనపర్తి, బిక్కవోలు, రంగంపేట, పెదపూడి మండలాల్లో సుమారు 445 మంది విద్యార్థులు ఎనిమిదో తరగతి చదువుతున్నారు.

పరీక్ష రాసేవారికి మెళకువలు చెబుతున్నాను



మా ఉపాధ్యాయుల మార్గనిర్దేశనంలో చదువుకుని నేను గతేడాది ఎన్ఎంఎంఎస్‌లో సాల్కర్‌షిప్‌కు అర్హత సాధించాను. ఇప్పుడు కొత్తగా ఈ పరీక్ష రాసేవారికి విజయం సాధించేందుకు మెళకువలు చెబుతున్నాను.

– వెల్ల శ్రావ్యాంజలి, విద్యార్థిని, 9వ తరగతి, కొంకుదురు ఉన్నత పాఠశాల

ప్రతి రోజూ సాధన చేయాలి



కేవలం పరీక్ష దగ్గర పడ్డాక చూద్దాం అని కాకుండా ఇప్పటి నుంచి ప్రతీరోజూ రెండు గంటల సమయం కేటాయించి చదువుకోవాలి. ఎక్కువగా ఆప్టిట్యూడ్‌పై దృష్టి పెట్టాలి. ఏటా మా పాఠశాలలో నుంచి విద్యార్థులు ఎన్ఎంఎంఎస్‌లో సాల్కర్‌షిప్‌కు ఎంపికవుతున్నారు. దాంట్లో నేనూ ఉండడం సంతోషంగా ఉంది.

– వానపల్లి బాలదుర్గ సత్య అఖిల్, విద్యార్థి, 9వ తరగతి, పందలపాక ఉన్నత పాఠశాల

సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఎక్కువ మంది ఎన్ఎంఎంఎస్ పరీక్ష రాసేలా చర్యలు తీసుకుంటున్నాం. ఎంపికై న విద్యార్థులకు తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ వరకూ ప్రభుత్వం ఏటా రూ.12 వేల చొప్పున స్కాలర్‌షిప్ వస్తుంది. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– సీహెచ్ సత్యనారాయణ, ఎంఈవో–1, బిక్కవోలు మండలం

ఆలయ అభివృద్ధి పనులు ప్రారంభం



ఆలయ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి దంపతులు

అనపర్తి: స్థానిక పాతవూరు ధరిణికోటలో ఉన్న ఉమామహేశ్వర స్వామి ఆలయం వద్ద నూతనంగా చేపట్టిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్తలు సబ్బెళ్ల అమ్మిరెడ్డి, తేతల ఉపేంద్రరెడ్డిల సౌజన్యంతో భక్తులు పూజలు నిర్వహించేందుకు వీలుగా నిర్మించిన మండపం, ఆలయ అర్చకుల గృహ సముదాయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు కొత్తూరి సత్యనారాయణమూర్తి(రాజా), సుబ్రహ్మణ్యశర్మ, మణికంఠశర్మల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక హోమాది క్రతువుల్లో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులతో పాటు అమ్మిరెడ్డి ఆయిల్స్ అధినేత సబ్బెళ్ల అమ్మిరెడ్డి, విజయలక్ష్మి దంపతులు పాల్గొని పూజలు జరిపారు. ఆలయ అభివృద్ధికి కృషిచేసిన ఎమ్మెల్యే దంపతులు, దాతలను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు సత్తి గీతావరలక్ష్మి, సబ్బెళ్ల చిన అమ్మిరెడ్డి, తేతల ఉపేంద్రరెడ్డి, నల్లమిల్లి సాయిరామారెడ్డి, నల్లమిల్లి రామచంద్రారెడ్డి, సత్తి రామకృష్ణారెడ్డి, నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, ఎస్ఎస్, చిర్ల వెంకటరెడ్డి, చిర్ల భాను తదితరులు పాల్గొన్నారు.

కాపవరం అభివృద్ధికి రూ.3 కోట్ల కేటాయింపు



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- ఉత్సాహంగా గడప గడపకూ..

మధురపూడి: కోరుకొండ మండలం కాపవరం అభివృద్ధికి రూ.3 కోట్లు కేటాయించామని, అలాగే అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేస్తున్నామని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. కోరుకొండ మండలం కాపవరంలో రెండో రోజు ఆదివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. తొలుత స్థానిక రామాలయంలో స్వామిని దర్శించుకున్నారు. అనంతరం గడప గడపకూ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ కాపవరంలో మౌలిక వసతులతో పాటు మరిన్ని సదుపాయాలు కల్పించామన్నారు. సొంతిళ్లు లేని పేదలకు త్వరలోనే ఇళ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేస్తామన్నారు. కోరుకొండ, కాపవరం గ్రామస్తుల కోసం ఎంపిక చేసిన ఇళ్ల స్థలాల విషయం కోర్టు వివాదంలో ఉండటంతో కొత్త ప్రాంతాన్ని తీసుకోనున్నట్టు తెలిపారు. పేదలకు సొంతిళ్లు దక్కకుండా ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు కోర్టుల్లో కేసులు వేయడం దుర్మార్గమన్నారు. చంద్రబాబు పాలనలో కాపవరం అభివృద్ధికి కేవలం రూ.80 లక్షలు కేటాయిస్తే, జగనన్న ప్రభుత్వం రూ.3 కోట్లు కేటాయించిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, సర్పంచ్ జాజుల రాము, ఉప సర్పంచ్ బయ్యే గనుకులమ్మ, హితకారిణి సమాజం డైరెక్టర్ కాలచర్ల శివాజీ, ఎంపీటీసీ కాలచర్ల నాగు, వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీరంగం శ్రీను, బుగ్గిలం భాను, బయ్యే దుర్గయ్య, ఏసురాజు, నాగార్జున, సచివాలయం సెక్రటరీ అన్వర్ పాల్గొన్నారు.

నాగ శైలరెడ్డిని అభినందించిన ఎమ్మెల్యే



నాగశైలరెడ్డిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి దంపతులు

అనపర్తి: మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు స్మారక నాణెం రూపకల్పనలో భాగస్వామి అయిన పి.నాగశైలరెడ్డిని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు ఆదివారం సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిత్రలేఖనాన్ని వారసత్వంగా స్వీకరించిన నాగశైలరెడ్డి ఎన్టీఆర్ స్మారక నాణెం రూపొందించే అరుదైన అవకాశం దక్కించుకున్నారన్నారు. వృత్తిలో మరింత ప్రతిభను కనబరిచి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. మండలంలోని రామవరంలో జన్మించిన నాగశైలరెడ్డి హైదరాబాద్‌లోని నాణేల ముద్రణ సంస్థలో రూపశిల్పిగా(ఇంగ్రివర్) బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇటీవల ఎన్టీఆర్ చిత్రపటంతో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన స్మారక నాణెం రూపకల్పనలో నాగశైలిరెడ్డి కీలకభూమిక పోషించారు. కార్యక్రమంలో రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ నల్లమిల్లి మురళీమోహనబాలకృష్ణారెడ్డి, పాలమూరు ఉపసర్పంచ్ సత్తి సూరారెడ్డి, వర్తక సంఘం మాజీ అధ్యక్షుడు సత్తి విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు దుప్పలపూడి ఉపసర్పంచ్ ఎన్నిక

గ్రామంలో 144 సెక్షన్ విధింపు

అనపర్తి: మండలంలోని దుప్పలపూడి గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ ఎన్నిక సోమవారం నిర్వహించనున్నారు. ఎన్నిక ప్రశాంతంగా జరిగేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గ్రామంలో భారీ బందోబస్తు ఏర్పాటుచేయడంతో పాటు పరిస్థితుల దృష్ట్యా గ్రామంలో 144 సెక్షన్ విధించారు. 2021లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో దుప్పలపూడి పంచాయితీ పరిధిలోని 10 వార్డు స్థానాలకుగాను 8 స్థానాల్లో వైఎస్సార్ సీపీ సానుభూతిపరులు, ఒక స్థానంలో ఇండిపెండెంట్, మరో స్థానంలో టీడీపీ సానుభూతిపరుడు గెలుపొందారు. 1, 9వ వార్డు సభ్యులుగా గెలుపొందిన అభ్యర్థులు వివిధ కారణాలతో తమ పదవులకు రాజీనామా చేయడంతో గత నెల 19వ తేదీన వార్డు స్థానాలకు ఉపఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో గ్రామానికి చెందిన వల్లభశెట్టి రామసతీష్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ సానుభూతిపరులు ఇద్దరూ భారీ మెజార్టీతో విజయం సాధించారు.

ఎన్నిక లాంఛనమేనన్న చర్చ

గ్రామంలో చోటు చేసుకున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో సర్పంచ్ నల్లమిల్లి సావిత్రి ఇటీవలే తన అనుచరులైన ఐదుగురు వార్డు సభ్యులతో కలిసి వైఎస్సార్ సీపీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ ప్రకటనతో నూతనంగా ఎన్నికైన ఇద్దరితో కలిపి మొత్తం నలుగురు వార్డు సభ్యుల మద్దతు మాత్రమే వైఎసోస్ఆర్ సీపీకి ఉండడంతో ఉపసర్పంచ్ ఎన్నిక రసకందాయంలో పడింది. అయితే సర్పంచ్ వర్గీయులు వైఎస్సార్ సీపీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించిన నాలుగు రోజులకే ఆ వర్గం నుంచి ఇద్దరు వార్డు సభ్యులు వైఎస్సార్ సీపీకే తమ సంపూర్ణ మద్దతు అని ప్రకటించారు. దీంతో తిరిగి వైఎస్సార్ సీపీ వర్గానికే ఆరుగురు వార్డు సభ్యుల మద్దతు లభించినట్లైంది. ఈ నేపథ్యంలో సోమవారం జరగనున్న గ్రామ ఉపసర్పంచ్ పదవి వైఎస్సార్ సీపీకి వర్గీయులకు దక్కడం లాంఛనమేనన్న చర్చ స్థానికంగా సాగుతుంది.

సారా కేసులో వ్యక్తి అరెస్టు

రంగంపేట: మండలంలోని వడిశలేరులోని అరుంధతీపేటలో నిర్వహించిన దాడుల్లో 10 లీటర్ల సారా కలిగి ఉన్న గ్రామానికి చెందిన తాతపూడి ఏసుబాబును అరెస్ట్ చేసినట్లు ఎస్ఈబీ సీఐ జి.వెంకటలక్ష్మి తెలిపారు. విచారణలో తాతపూడి కన్నారావు అనే వ్యక్తి సారా సరఫరా చేసినట్టు తెలపడంతో కన్నారావుపై కూడా కేసు నమోదు చేశామన్నారు. దాడుల్లో ఎస్ఈబీ ఎస్ఐ శేఖర్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా పోటీలకు ఎంపికలు

బిక్కవోలు: మండల స్థాయి స్కూల్ గేమ్స్ టోర్నమెంట్‌కు బిక్కవోలు ఉన్నత పాఠశాలలో ఎంపికలు జరుగుతున్నాయని పాఠశాల హెచ్ఎం పల్లా వీర ప్రభాకరరావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు తొమ్మిది క్రీడాంశాల్లో ఈ నెల 4 నుంచి 13వ తేదీ వరకూ పాఠశాల స్థాయిలో ఎంపికలు జరుగుతాయన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన అన్ని పాఠశాలల క్రీడాకారులు ఈ ఎంపికల్లో పాల్గొనొచ్చని చెప్పారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు అనపర్తిలో జరిగే నియోజకవర్గ స్థాయి ఎంపికల్లో పాల్గొంటారన్నారు

ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డుకు రెండు దరఖాస్తులు

బిక్కవోలు: మండలం నుంచి ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డుకు ఇద్దరు దరఖాస్తు చేసినట్లు ఎంఈవో-1 సీహెచ్ సత్యనారాయణ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని పందలపాక ఎంపీపీ మెయిన్ స్కూల్‌లో పనిచేస్తున్న కర్రి వీర్రాఘవరెడ్డి, మెళ్లూరు ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న జిత్తుక కామేశ్వరరావులు దరఖాస్తు చేశారన్నారు.

525 క్యూసెక్కుల సాగునీరు విడుదల

సీతానగరం: పురుషోత్తపట్నంలోని తోట వెంకటాచలం పుష్కర ఎత్తిపోతల పథకం నుంచి 525 క్యూసెక్కుల సాగునీటిని మెట్టప్రాంత పొలాలకు అందించామని జలవనరులశాఖ డీఈ వెంకట్రావు ఆదివారం తెలిపారు. పుష్కర-1 నుంచి రెండు మోటార్లు, పుష్కర-2 నుంచి ఒక మోటారు ద్వారా సాగునీరు విడుదల చేశామన్నారు. గోదావరి నీటి మట్టం 16.5 మీటర్లు ఉందన్నారు. అలాగే ఎత్తిపోతల పథకం నిర్వహణ కాలపరిమితి మెగా కంపెనీతో ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా పది మోటార్లు, పంపులను పరిశీలిస్తున్నామన్నారు.

శరవేగంగా కాలువ పనులు

మధురపూడి: పుష్కర ఎత్తిపోతల పథకం కాలువలో నీరు సక్రమంగా ప్రవహించేందుకు తుప్పలు, చెత్త తొలగింపు పనులు చురుకుగా జరుగుతున్నాయి. కోరుకొండ మండలంలోని దోసకాయలపల్లి, బూరుగుపూడి, గుమ్ములూరు, మధురపూడి గ్రామాల్లో శరవేగంగా నిర్వహిస్తున్నారు. పుష్కర కాలువ పరిధిలో కోరుకొండ మండలంలో 6,045 హెక్టార్ల విస్తీర్ణంలో వరి భూములున్నాయి. ఇప్పటికే నాట్లు పనులు పూర్తయ్యి, కలుపు మొక్కల తొగింపు పనులు జరుగుతున్నాయి. దీంతో పొలాలకు సాగునీటి అవసరాన్ని గుర్తించి ఈ పనులు నిర్వహిస్తున్నారు.

నవోదయకు ఎంపిక



అరవింద్ మోహన్

మధురపూడి: కోరుకొండ మండలం పశ్చిమగానుగూడెం ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న డొక్కా అరవింద్ మోహన్ ఎటపాక జవహర్ నవోదయ విద్యాసంస్థలో సీటు సంపాదించాడు. ఇక్కడ ఐదో తరగతి చదువుతున్న మోహన్ ఎటపాకలో ఆరోతరగతిలో చేరనున్నాడు. ఈ సందర్భంగా అరవింద్‌ను కోరుకొండ బిలీవర్స్ ఈస్టన్ చర్చి పాస్టర్ కె.విజయకుమార్, చర్చి సంఘపెద్దలు అభినందించారు.

సూర్యదేవునికి పంచామృతాభిషేకాలు

పెదపూడి: మండలంలోని జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన శ్రీ ఉషా, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత శ్రీసూర్యదేవునికి ఆదివారం ఆలయంలో పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకటనరసింహాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారికి విశేష పూజలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తుల కోసం అన్నదానం నిర్వహించారు.

ట్రాఫిక్ సమస్యకు చెక్!



గోకవరం ఠాణా సెంటర్‌లో ఊర కాలువపై శిథిలావస్థలో ఉన్న వంతెన



నూతన వంతెన నిర్మాణంలో భాగంగా రహదారికి ఇరువైపులా తొలగించిన చెట్లు

- గోకవరం ఠాణా సెంటర్‌లో వంతెన నిర్మాణం
- ఇటీవల శంకుస్థాపన చేసిన ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే చంటిబాబు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

గోకవరం: మండల కేంద్రమైన గోకవరంలో ట్రాఫిక్ కష్టాలు తీరనున్నాయి. ట్రాఫిక్ సమస్యకు మూల కారణమైన స్థానిక ఠాణా సెంటర్‌లో బ్రిటిషు కాలం నాటి ఇరుకు వంతెన స్థానంలో నూతనంగా వంతెన నిర్మిస్తున్నారు. జాతీయ రహదారి 516–ఇ నిర్మాణంలో భాగంగా వంతెన నిర్మాణానికి రూ.10 కోట్లు మంజూరయ్యాయి. దీంతో ఇటీవల కాకినాడ ఎంపీ వంగా గీత, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు నూతన వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

8 ఏళ్ల క్రితమే ప్రతిపాదనలు

ఈ వంతెన స్థానంలో నూతనంగా వంతెన నిర్మించడానికి ఎనిమిదేళ్ల క్రితమే ఆర్ అండ్ బీ అధికారులు రూ.కోటి వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధం చేసి టెండర్లు ఆహ్వానించారు. ఆ నిధులతో వంతెన నిర్మాణం పూర్తికాదంటూ కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో వంతెన నిర్మాణం జరగలేదు. ప్రస్తుతం రాజమహేంద్రవరం నుంచి ఏజెన్సీ మీదుగా విజయనగరం జిల్లాకు 516–ఇ జాతీయ రహదారి నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతుండటంతో గోకవరంలో ఠాణా సెంటర్ వంతెన నిర్మాణానికి మోక్షం లభించింది. త్వరలోనే వంతెన నిర్మాణం పూర్తయ్యి ట్రాఫిక్ సమస్య పరిష్కారమవుతుందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దశాబ్దాల సమస్యకు పరిష్కారం

ఈ వంతెన నిర్మాణం పూర్తయితే దశాబ్దాల కాలంగా నెలకొన్న సమస్య పరిష్కారం కానుంది. ఏజెన్సీకి ముఖద్వారమైన గోకవరం ఠాణా సెంటర్లో ఊర కాలువపై ఉన్న వంతెనను సుమారు 100 సంవత్సరాల క్రితం బ్రిటిషు కాలంలో నిర్మించారు. రెండు దశాబ్దాల క్రితమే ఈ వంతెన శిథిలావస్థకు చేరింది. నిత్యం ఈ వంతెనపై రాజమహేంద్రవరం నుంచి తెలంగాణ, ఛత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు వందల సంఖ్యలో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. వంతెన ఇరుకుగా ఉండటం, వంతెనకు ఇరువైపులా మలుపులు ఉండటంతో భారీ వాహనాలు వంతెనపై ఇరుక్కుపోయి ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ప్రతీరోజూ ఉదయం, సాయంత్రం ఈ సమస్య సర్వసాధారణంగా మారిపోవడంతో ప్రయాణికులు నిత్యం తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ ఇరుకు వంతెనపై అనేక ప్రమాదాలు జరిగి పలువురు మృత్యువాతపడ్డారు.

16 మీటర్ల వెడల్పుతో నూతన వంతెన

జాతీయ రహదారి 516–ఇ నిర్మాణంలో భాగంగా గోకవరం ఠాణా సెంటర్‌లో నూతనంగా వంతెన నిర్మించేందుకు చర్యలు తీసుకున్నాం. టెండర్ ప్రక్రియ పూర్తయ్యింది. వంతెన నిర్మాణంలో భాగంగా రహదారికి ఇరువైపులా ఉన్న చెట్లు తొలగిస్తున్నాం. భూ సేకరణ ప్రక్రియ నడుస్తోంది. నూతన వంతెనను 16 మీటర్ల వెడల్పు, 18 మీటర్ల పొడవుతో నిర్మించనున్నాం. త్వరలోనే వంతెన నిర్మాణ పనులు ప్రారంభిస్తాం.

– శ్రీనివాస్, ఆర్అండ్‌బీ శాఖ జేఈ

నియోజకవర్గంలో ఆలయాలకు మహర్దశ

- జక్కంపూడి విజయలక్ష్మి
- చక్రద్వారబంధంలో వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి భూమిపూజ



చక్రద్వారబంధంలో భూమిపూజ సందర్భంగా హోమంలో పూర్ణాహుతి సమర్పిస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి



బొబ్బిల్లంక జగనన్న కాలనీలో గృహప్రవేశంలో పాల్గొన్న జక్కంపూడి విజయలక్ష్మి

రాజానగరం: నియోజకవర్గంలో ప్రగతి, ప్రజల సంక్షేమంతో పాటు దేవాలయాల అభివృద్ధికి కూడా ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. చక్రద్వారబంధంలో సుమారు రూ.కోటితో నిర్మించనున్న శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఆదివారం ఆమె భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన యజ్ఞ,యాగాలలో పాల్గొన్నారు. వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి టీటీడీ నుంచి రూ.10 లక్షల మంజూరుకు ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కృషి చేస్తున్నారన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో 117 ఆలయాల పునర్నిర్మాణానికి, అభివృద్ధికి టీటీడీ నుంచి నిధులను మంజూరు చేయించారన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులతో పాటు డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెద వెంకన్న, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, మాజీ కన్వీనర్ మండారపు వీర్రాజు, నాయకులు వాడ్రేవు శ్రీను, తాతబ్బాయి, త్రిమూర్తులు, మార్గాని శ్రీను పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారం

సీతానగరం: నిరుపేదల సొంతింటి కలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నెరవేర్చారని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. బొబ్బిల్లంక జగనన్న లేఅవుట్ కాలనీలో ఆదివారం జరిగిన షేక్ షీలార్ ఇంటి గృహప్రవేశానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె.. షీలార్ దంపతులతో రిబ్బన్ కట్ చేసి గృహప్రవేశం చేయించారు. ఆమె ముఖ్యమంత్రి జగన్ రాష్ట్రంలో 31 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు ఇళ్ల స్థలాలు కేటాయించడమే కాక, ఇళ్ల నిర్మాణానికి అన్ని చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. జగనన్న కాలనీలో స్థలాలు పొందిన లబ్ధిదారులు, త్వరగతిన ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకోవాలన్నారు. అనంతరం బొబ్బిల్లంకలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులన పరిశీలించారు. సర్పంచ్ మెల్లిమి రామచంద్రరావు, పార్టీ నాయకులు మల్లిన చౌదరి, అరిగెల రవి, ఎం.శ్రీనివాసు పాల్గొన్నారు.

వేగవంతంగా రోడ్డు నిర్మాణ పనులు

రాజమహేంద్రవరం – సీతానగరం నాలుగు లైన్ల విస్తరణ రోడ్డు పనులు వేగవంతంగా జరుగుతున్నాయని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి తెలిపారు. బొబ్బిల్లంక శివారున సిమెంట్ రోడ్డు పనులను ఆదివారం ఆమె పరిశీలించారు. నాణ్యత విషయంలో రాజీపడవద్దని కాంట్రాక్టర్‌కు సూచించారు. పనులు వేగవంతంగా చేయాలన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఎటువంటి చర్యలు తీసుకోలేదని, పుష్కరాల సమయంలో వేసిన రోడ్డు నెల రోజులకే శిథిలమైందన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తక్షణమే ఎమ్మెల్యే జక్కంపూడి రాజా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ దృష్టికి తీసుకువెళ్లి, నాలుగు లైన్ల రోడ్డును మంజూరు చేయించారని గుర్తు చేశారు. నవంబర్ నాటికి పనులు పూర్తవుతాయన్నారు.